# గీ త క త్తి

ఏ కాం కి క

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్,

హైదరాబాదు - 500 084. ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

(Digitised 23 April 2026)

# GeetaKatti (గీతకత్తి)

(A Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

డిజిటలీకరణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084.
Cell -9440495887.

Web Site : can down load digital copies at
nanduri.co.in

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# కృతిసమర్పణము

## మిత్రశ్రీ
## డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారికి

*అంకితమగుత చిరస్నే*
*హాంకము స్వర్ణోత్సవోపహార స్రజమై*
*సంకలనముగా నా యే*
*కాంకికలు నవభువనవిజయాధ్యతునకున్.*

*రాజువుగావుగాని, నటరాజువు నాటకరంగమందు, ఉ*
*త్తేజమునం, దుదారగుణదీధితి, రాజసతీవియందు ఏ*
*రాజుకు తీసిపోవు; అనురక్తిని ఈ కృతి గొమ్ము, స్వర్ణ నీ*
*రాజన మంగళాశిష విరాజన జన్మదినోత్సవమ్ములో.*

*నీ మది చంద్రికా తరళ నిత్యవసంతమనోజ్ఞ నంద నా*
*రామము; దివ్యసౌరభ నిరంతర నాట్యకళాప్రఫుల్లమున్;*
*కోమలభావవీచికలకున్ గిలిగింతలు  పెట్టు ఈ పూరా*
*రామము నీదు  పేరున విరాజిలెడిన్ ప్రతిబింబసామ్యమై.*

# నివేదన

## I

**"గీతకత్తి"** ఏకాంకిక 'దశరూపకములు' సంపుటిలో ఒకటి. ఉరికంబం, గీతకత్తి, తమ్ముడు, పద్యంగాని పాటగాని లేని పోడిమాటల ప్రోగులు. గీతకత్తిలో రెండే పాత్రలు. మిగతా ఏకాంకికలలో జ్యోత్స్నాభి సారిక, గోదావరి సంగమం నృత్యనాటికలు. వీరాభిషేకం, త్యాగరాజు గద్య పద్య సంకలితాలు. మరణాంతకం వట్టి ప్రహసనం. ఈ ఏకాంకికలలో ప్రస్ఫుటంగా కనిపించే వైవిధ్యంలో రచయిత ఆత్మీయత వినా, ఏకత్వం మృగ్యం.

## II

తెలుగుగడ్డ — అవహేళనరూపకం (Satire). ఈ అభూత కల్పన చదివిన దేశభక్తులకు రచయితపై కోపం రావచ్చు. వారిని రచయిత ఉమాభిత అర్థిస్తున్నాడు. కాని, ఒక మనవి. ఆత్మనిష్ఠ యైన అవహేళన ఆరోగ్యలక్షణం. అదిగాక తెలుగుగడ్డలో అవహేళనపూర్వకంగా భాసించే ప్రతి అక్షరం వెనుక రచయిత వేడి కన్నీటిబొట్లు మారువేషంలో దాగియున్నదని మరువవద్దు.

## III

ఏ నాటకమైనా ఈ జగన్నాటకంలో అంతర్నాటకమే — అనే అనుభూతి పొందినవాడు జీవన్ముక్తుడే. జగన్నాటకాన్ని మించిన నాటకం ఏముంది కన్నుతెరచి చూడగల సహృదయునికి? వేరే నాటకాలు చదవటం ఎందుకు? ఆడటం ఎందుకు? వ్రాయటం ఎందుకు?

## IV

ఈ నాటికలు వ్రాసిన చిరకాలానికి ప్రచురించటానికి కారణం రచయిత కాదని మనవి. ఈ నాటికల రచనకు మిత్రశ్రీ డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం ముఖ్య ప్రేరకుడు. రచనను ప్రోత్సహించి చేసిన తప్పుకు ముద్రణభారం వహించి, ప్రచురించటం నిష్కృతి కాబోలు.

## V

ఈ ఏకాంకికలు చదివి, ఎవరూ విలువగల తమ కాలాన్ని వెచ్చించవద్దని రచయిత హృదయపూర్వకమైన మనవి. ఒకవేళ పొరపాటున చదివినా ప్రదర్శించుటకు పూను కోవద్దని రచయిత సలహా. ప్రదర్శించేవారు తమకాలాన్నే గాక ప్రేక్షకుల అమూల్య కాలమునుగూడ దుర్వినియోగం చేసినవారవుతారని, అందుకు రచయిత ఎంతమాత్రమూ బాధ్యుడు కాదని హెచ్చరించుచున్నాను.

**నండూరి రామకృష్ణమాచార్య**

# గీతకత్తి

**భూమికలు:**

1. **నాగన్న**
2. **ఇనస్పెక్టరు**

# గీతకత్తి

ఒక వెదురుపాక: రెండు వెదురుమంచాలు, ఒక వెదురుబల్ల, ఇప్పకల్లుతో నిండిన సొరకాయ దూలానికి వేలాడుతూ ఉంటుంది. పెద్దపులి చర్మాలు: ఒకటి దూలానికి వేలాడుతూ ఉంటుంది. మరి యొకటి నేలమీద పరచి ఉంటుంది. ఇంకొకటి వెదురుబల్లమీద పరచి ఉంటుంది. ఎదురుగా పెద్ద గీతకత్తి వేలాడుతూ ఉంటుంది.

*తెరలో కలకలం*

నలుగురు <u>రై</u>దుగురు రెక్కలు విరిచికట్టిన మనిషిని మోసుకొనివచ్చి, 'విప్పండిరా విప్పండి, కట్టు విప్పండి' అంటూ లోపలికి నెట్టుతారు.

*నాగన్న ప్రవేశం*

**నాగన్న:** రావయ్యా రా; ఇనీ సిపెకటు రా. ఆ వెదురుబల్ల మీద కూర్చో. మా పోరగాళ్లు ఈ అర్ధరాత్రి లేపేశారు. పాపం! ఇరవైమైళ్లు బ్రతికున్నవాణ్ణే మోసుకురావటం, అబ్బ! బాగా విరిగిపోయినట్లున్నా వేం.

**ఇనస్పెక్టరు:** అవును, ఒళ్లు హానంహానమైపోయింది.

*రక్తాలు సాచుకుంటూ - నిలబడుతాడు*

**నాగన్న:** కూర్చో-కూర్చోవయ్యా, కూర్చో.

**ఇన:** మీరు కూర్చోండి.

**నాగన్న:** నే కూకుంటున్నాగా, కూర్చో, కూర్చో, అను కున్నాంగాని లేకపోయిందా? ఏదయితే ఏం-తెల్లవారా లిగా- ఇదుగో కొంచం ఈ కల్లు తాగు.

**ఇన:** అబ్బే - వద్దు.

**నాగన్న:** ఇది తాటికల్లు కాదయ్యా, ఇది ఇప్పకల్లు, బలే బాగుంటుంది. చూడు (అని సొరకాయ చేతికందిస్తాడు.)

**ఇన:** చాలా ఘాటుగా వాసన కొడుతుందే.

**నాగన్న:** ఏం! నీసాలోకి ఎక్కిస్తేగాని బస్తీవాళ్లకు గిట్ట దేమో!

**ఇన:** సరే, మీమాట ఎట్లాకాదనగలను?

**నాగన్న:** ఇనీసిపెకటరులంతా చడతాగేవారేకదా, ముందే పసిగట్టానుగా నీవు క్రొత్త సరుకువని. ఏం ఇంకా అల వాటు కాలేదా? పైసాఖర్చుపెట్టకుండా బేవార్సుగా వచ్చేదిగా - అలవాటైనా పరవాలేదు. తాగవయ్యా, ఈ లాగెయ్యి.

**ఇన:** మొదలుపెట్టటమే కొంచం కష్టం. తరువాత వదలి పెట్టటం అంతకంటె కష్టం.

**నాగన్న:** నీకు ముందు పట్టుబడిన ఇనీసిపెకటరు బలే హుషారుగా త్రాగేశాడు.

**ఇన:** అతనికి అలవాటేమో!

**నాగన్న:** ఏమో గీమో! సారగలో కానికి బంగారు నిచ్చెన మెట్లు ఎక్కాలంటే త్రాగి తందనాలు పాడుతూవుంటే క్రిందకు పడిపోతారు కాని.

**ఇన:** ...కాసి.

**నాగన్న:** ఈ రాత్రి అంతా కాపలా కాయటం కష్టంకాబట్టి తప్ప త్రాగించేస్తే, ఒళ్లు తెలియకుండా నిద్రలో పడి ఉంటాడు. ఇప్పుడే చంపేస్తే - ఈ రాత్రంతా శవజాగరణ చెయ్యాలి.

**ఇన:** అంటే (అని నోటివరకూ సారకాయ పోనిచ్చి రెండు గుక్కలు మ్రింగి-డెక్కపడి పొ లమారి బాధపడతాడు.)

**నాగన్న:** ఆ దొంగనాకొడుకు - మి త్రింజయుడు దొరుకుతేర-నాసామిరంగ-ఎంత బాగుండేది.

**ఇన:** మృత్యుంజయుడు ఎవరు?

**నాగన్న:** ఏం అతనిపేరు వినలేదా! ఇనీసిపెకటర్లలో అంత మొనగాడు లేడంటారే! నీది క్రొత్త ముగం. అయినా వింతగానే ఉందే అతనిపేరు వినకపోవటం.

**ఇన:** ప్రోహిబిషను ఇనస్పెక్టరా? నేను అతనిపే రెప్పుడూ విన లేదే!

**నాగన్న:** నాసామిరంగ! ఆడే దొరుకుతే!

**ఇన:** దొరుకుతే

**నాగన్న:** బ్రదికేవుండగా చర్మం ఒలిపించేవాణ్ణి. మా పిల్ల కాయలు నలుగురిని పట్టుకొని బొక్కలో త్రోయించాడు. ఆళ్లు ఇంకా జైలులోనే ఉన్నారు. దొరక్కపోతాడు ఇదుగో, ఇదే ఆడిబొమ్మ, పోటిక్రాపుట.

**ఇన:** ఆ ఆటేకు దూలానికి వేలాడగట్టిందేనా?

**నాగన్న:** ఆడే మిత్రిం జయుడు.

**ఇన:** నే నెప్పుడూ చూచిన మనిషిలా లేడు.

**నాగన్న:** నిన్ను పట్టుకొచ్చినప్పుడు ఆడేనేమో అని ఎంత ఆసపడ్డానో.

**ఇన:** ఆయ్యో-నీకు ఆశాభంగం కలిగించినందుకు విచారిస్తున్నాను.

**నాగన్న:** అయితే ఏంలే! ఎవరైతే ఏం? ఏ ఇనీసిపెకట రైనా ఏం ఒదిలేదిలేదు. మిత్రింజయుడుగాడై తే తోలు ఒలిపించేవాణ్ణి, ఇంకోడైతే తుపాకీతో కాల్చి పారేస్తాము, అంతే.

**ఇన:** అయితే - నేను ఒక ఇనస్పెక్టరునని నీ వట్లా ఊహిస్తున్నావు!

**నాగన్న:** ఏముంది? సారాబట్టిదగ్గర చెట్టుమీద కొండ ముచ్చులా దాగున్నావుటగా - ఏమో ఎవడి వైనా నిన్ను

ఒదిలిపెడితే మాకు ముప్పరావచ్చు. చేతులారా ప్రమా దము తెచ్చిపెట్టుకోటం ఎందుకు?

**ఇన:** బలే మంచి తెలివిగలవాడవే.

**నాగన్న:** ఇదుగో - యీ చుట్ట కాల్చు, ఒకటోరకమైన పొగాకు.

**ఇన:** నాకు అలవాటు లేదు.

**నాగన్న:** ప్రక్కనున్నవాడికి ఇవ్వకుండా ఇంతవరకు పుట్టిన తర్వాత చుట్ట కాల్చలేదు. అయితే – మరి - నీవు చుట్ట కాల్చవు, సారా త్రాగవు-ఇంక బ్రతుకులో మజా ఏమి తుంది నీకు.

**ఇన:** (నవ్వి) చచ్చిపోయిన శవంచేతకూడ నవ్విస్తున్నా వయ్యా, బలే నీ వేవరోగాని...

**నాగన్న:** అయితే నన్నరగవన్న మాట!

**ఇన:** నాకేం తెలుసు!

**నాగన్న:** నాపేరు నాగన్నగారంటారు. తెలిసిందా!

**ఇన:** నువ్వు నాగన్నవా?

**నాగన్న:** ఏం, అట్లాచూస్తున్నావు!

**ఇన:** అయితే లచ్చన్న, అతని తమ్ముళ్లని చంపేసింది నీవేనా?

**నాగన్న:** అవును. ఆ విషయం నీకెట్లా తెలిసింది?

**ఇన:** ఎట్లా తెలియటం ఏమిటి? అన్ని పత్రికల్లోను పడితే.

**నాగన్న:** ఏమని పడింది?

**ఇన:** మీరు ఇదివరకు చాలామందిని చంపేశారుటగా.

**నాగన్న:** అవన్నీ నీకెట్లా తెలిశాయి.

**ఇన:** పత్రికలలో అన్నీ పడతాయి. మొన్న మొన్న లచ్చన్న మేనల్లుణ్ణి చంపేశారుటగా - మళ్లీ ఆ వెనుకటి విషయాలన్నీ పడ్డాయి. మీ బొమ్మగూడ పత్రికలో వేశారే! ఆ బొమ్మ చూచినా మిమ్మల్ని నేను గుర్తపట్ట లేకపోయానే?

**నాగన్న:** నే నెప్పుడూ ఫోటోగాపు దిగలేదే!

**ఇన:** అంతమాత్రంచేత పత్రికలవాళ్లు మీ ఫోటో వేయడం మానుకోరులెండి. మీ రెప్పుడూ పత్రికలు చదవరా యేం?

**నాగన్న:** పుస్తకం పుచ్చుకొని ఇరవై యేళ్లయింది. చిన్నప్పుడేదో అచ్చరాలు దిద్దాను. అంతే. రెండుపంక్తులు చదవాలంటే నాకు రెండుగంటలు పడుతుంది.

**ఇన:** అయ్యయ్యో, అయితే-మీ జీవితచరిత్రగూర్చి మీ రెన్నో ముఖ్యవిషయాలు చదువుకోలేదన్న మాట. ఆ లచ్చన్న తమ్ముళ్లని మొత్తం ఎంతమందిని చంపారు?

**నాగన్న:** ఎంతమంది అని పత్రికలలో వ్రాశారేమిటి?

**ఇన:** ఇరవైయొక్క మందిట.

**నాగన్న:** అబ్బే! ఆంతమంది కాదు, పదకొండుగుర్ని మాత్రమే.

**ఇన:** ఇంత - వాళ్ల అన్నదమ్ములే యేనమండుగురన్నారు.

**నాగన్న:** ఇంకా ఇద్దరు తమ్ముళ్లు, ఏనిమిదిమంది మేనల్లుళ్లు మిగిలిపోయారు. ఎప్పటికైనా నా ఇరవైయొకటీ పూర్తి చేయాల్సిందే.

**ఇన:** ఎప్పుడు పూర్తిచేస్తారు?

**నాగన్న:** ఏముంది - ఈసారి నా కెదురుపడినప్పుడు.

**ఇన:** వాళ్లు మీ మీదకే వస్తారా!

**నాగన్న:** తండ్రికి పుట్టినవాళ్లైతే వస్తారా?

**ఇన:** అయితే, అసలు, మొదట దెబ్బలాట ఎట్లా వచ్చింది?

**నాగన్న:** ఎదవలు, ఎదవ లంట. తాగలేని పిల్లి బోర్ల దోసుకుందట!

**ఇన:** అదేమిటి!

**నాగన్న:** గూడెంలోకల్లా బీదోడు, దాసరోడు పదిరూపాయలు పెట్టి చచ్చీచెడి సారా తయారుచేసి సీసాలు వాళ్ల గడ్డివాములో వెనుక దాతిపెట్టాడు.

**ఇన:** గడ్డివాములోనా! ఎందుకు?

**నాగన్న:** ఎందుకేమిటి? నీకీ విషయాలేమీ తెలిసినట్లుగా లేవే?

**ఇన:** సరే. ఆ తరువాత యేమైంది?

**నాగన్న:** లచ్చన్న దివరితమ్ముడు తెల్లోడు, ఆడు చావలే చివరికి. తండ్రికి పుట్టిన ఎదవైతేగా! వాడు, ఆ సీసాలన్నీ - పోనీ మగసిరిగా అమ్ముకున్నాడా, తానూ త్రాగాడా? పిరికిపెదవ. అమ్ముకోలేదు సరిగదా, అన్నీ నేలపాలు చేశాడు. ఎవడు తిన్నట్లు.

**ఇన:** అయితే, చివరకు ఎవరూ త్రాగలేదన్నమాట.

**నాగన్న:** లేదు, ఆ దాసరోడు ఎక్కడ అమ్ముకొని బాగుపడి పోతాడో అని ఏడుపుగొట్టు మొండాకొడుకు పారబోశాడు.

**ఇన:** అయితే, మీకు మీకు తగవు ఎందుకు?

**నాగన్న:** నన్ను మధ్యవర్తిగా తగవు చెప్పమన్నారు. ఓరి ఎర్రి మొగం, నీది తప్పురా అంటే, నాయెదుర నోరు ఎత్తక, ఎనుక కూయటం మొదలెట్టాడు ఆ తెల్లోడు. నేనెల్లి పెద్దాడకదా అని లచ్చన్నగాడితో చెపితే, అట్లాగే అని మా మనుమడిదగ్గర మా తాతను తిట్టాడట. నాకు కోపంవచ్చి, అదుగో చూస్తున్నావుగా, ఆ గీతకత్తితో పుర్రె తెగేశాను.

**ఇన:** అయితే, మీ తాతగారంటే మీకు చాల యెక్కువ ప్రేమ అన్నమాట. ఆయన మిమ్మల్ని చాలా ప్రేమతో పెంచాడేమో!

**నాగన్న:** అబ్బే, నేను పుట్టటానికిముందే సచ్చిపోయాడు మా తాత. మా తాతకు అల్లతాతకుకూడ పడేదికాదట. అవి అన్నీ ఆళ్లు తవ్వితే, నేను పురెలవేట వేటాడేస్తాను. అసలు మా గీతకత్తి మా ముత్తాతగారు చేయించి తీసుకొచ్చిన నాడే బోణీ - బలే మంచిబోణి. ఒక క్రొత్త ఇనీసిపెకటరు తలకాయ గీసేశాడుట. అప్పటినుంచి ఒకటే పురెలవేట. ఏదో మీబోటి పెద్దమనుష్యుల్ని చంపాలంటే ఈమధ్య తుపాకీ తీస్తున్నాముగాని, లేకపోతే మాలోమాకు ఈ గీతకత్తి చాలు.

**ఇన:** అయితే ఈ గీతకత్తి పిత్రార్జితంగా వచ్చిందన్న మాట.

**నాగన్న:** మా పోరగాళ్లు ఈ అర్ధరాత్రి లేపారు. పడుకో వచ్చు, ఇదుగో ఈ యిప్పకల్లు త్రాగు.

**ఇన:** అబ్బే త్రాగను.

**నాగన్న:** అయితే, ఈ రాత్రిఅల్లా తెల్లవారేవరకు నీకు ఎవరు కాపాలాకాస్తూ కూర్చుంటారు?

**ఇన:** నే నెక్కడకూ పారిపోదలచుకోలేదే - మీరు మెడ పట్టుకు గెంతేతప్ప.

**నాగన్న:** ఏమయ్యోయి, నిన్ను ఒదిలిపెట్టుతానని కలలో కూడా అనుకోకు. నీవు పారిపోటానికి చూడవచ్చు, అందులో తప్పులేదు. అందరికీ ప్రాణాలు తీపే.

**ఇన:** నేనా పారిపోయేది.

**నాగన్న:** ఏం! తెల్లవారగానే నిన్ను చంపేసి ప్రొద్దుపొడవకుండా తగలబెట్టేసి బూడిద, ఆస్తికలు గోదావరిలో కలిపేస్తాము.

**ఇన:** అమ్మయ్యో! నేను కోరుకునేది సరిగ్గా ఆదే, నా బాధలన్నీ విరగడవుతాయి.

**నాగన్న:** అంటే ఏమిటి నీ ఉద్దేశం!

**ఇన:** ఇప్పటికి ఆరు నెలలనుండి ఆత్మహత్య చేసుకోవాలని అల్లాడిపోతున్నాను.

**నాగన్న:** ఆఁ చచ్చిపోవాలనుకుంటున్నావా! ఏం! ఎందు చేత! ఇంత చిన్నవయసులోనే యెందుకా బుద్ధి పుట్టింది!

**ఇన:** ఏమందీ, బ్రదకటం ఇష్టంలేదు.

**నాగన్న:** ఆఁ. ఏదో కారణం ఉండాలి. ఏం? అప్పులు ఎక్కువ చేసి దివాళాతీసే స్థితిలో ఉన్నావా!

**ఇన:** అయితే, డబ్బు పోగొట్టుకునే అప్పు లాళ్ళు ఆత్మహత్య చేసుకోవాలి. నా కంత అప్పు లేదు.

**నాగన్న:** ఏం? నీ పెళ్లాం ఎవరైనా నా తగులుకుని లేదిపోయిందా!

**ఇన:** అంత అదృష్టమే! లేదు. ఎవడైనా నా లేపుకుపోయే మహాత్ముడు కనిపిస్తే వేయినూటపదహార్లు తాంబూలంలో పెట్టి కన్నెధార పోస్తాను.

**నాగన్న:** మరి అయితే, చచ్చిపోవాలనుకోటం ఏం! ఎందుచేత!

**ఇన:** ఏమందీ బ్రదకటం ఇష్టంలేదు.

**నాగన్న:** కాదు, ఏదో కారణం ఉండాలి.

**ఇన:** వేరే కారణం ఏమీ లేదు. ఈ జీవితంమీద విరక్తి పుట్టింది. బ్రదకటం విసుగ్గా ఉంటోంది.

**నాగన్న:** విసుగా!

**ఇన:** అవును, తినటం, నిద్రపోవటం, లేవటం-మళ్ళాతినటం, నిద్రపోవటం, లేవటం. ఇదేగా బ్రదకటం అంటే-తలకాయవున్న ఏమానవుడికైనా విసుగెత్తి తీరాలి. అదిగాక, బ్రదకాలన్నా, మజాగా చుట్టా, కల్లూ, సారా ఏమీ గిట్టవుకూడా.

**నాగన్న:** అందుకనే అలవాటు చేసుకోవలసింది.

**ఇన:** అదిగాక, మనుషులంతా దుర్మార్గులు. ఈ లోకంలో ప్రేమ అనేది వట్టి నటన, బూటకం. అసమర్థులు, దుర్మార్గులు, వైధవలంతా పైకివచ్చి గొప్ప గొప్ప వాళ్లయిపోతున్నారు. మహాత్ములు, సమర్థులు అంతా అడుగడుగున పడి పూడిపోయి బ్రదకటానికి వీలుకాక, చావడానికి సాహసం లేక నడపీనుగులుగా నివసిస్తున్నారు.

**నాగన్న:** అయితే బస్తీలో కాకుండా పల్లెటూళ్లలో ఉండవలసింది.

**ఇన:** ఎక్కడయినా ఒక్కటే. అంతా దొంగవైధవలే. తప్పుడునోట్లు సృష్టించేవాళ్లు అబద్ధాల వీలునామాలు వ్రాసేవాళ్లు, తమ్ముళ్లని దగాచేసేవాళ్లు మేడలు మిద్దెలు కట్టుకొని సుఖిస్తున్నారు. నిజంచెప్పేవాడు న్యాయస్థానం లోకూడ అభాసేకదా. అబద్ధాల సాక్ష్యలవాళ్లను, తప్పుడు దస్తావేజులు సృష్టించేవాళ్లను న్యాయస్థానాలు ఏమీ చేయలేవు. ఇక దేవుడిపేరుమీద జరిగే అన్యాయాలకు, అఘాయిత్యాలకు, కుట్రలకు అంతే లేదు. ఈ పాడుప్రపంచంలో బ్రదికివుండటంకంటె హృదయం వున్న ఏమనిషి. అయినా చచ్చిపోవటమే మంచిది. మీ రింతమందిని చంపివేశారంటే నిజంగా ఆలోచిస్తే మీ ఋణం వాళ్లు చచ్చినా తీర్చుకోలేరు.

**నాగన్న:** బాగుంది. నీవీ మాటలు ఎందుకు అంటున్నావా అని ఆలోచిస్తున్నాను.

**ఇన:** కాదు, ఈ ప్రపంచంకంటె పెద్ధ ప్రహసనం ఇంకొటి లేదు. ఈ మహాయాత్రలో మరమేకులా, రంకులరాట్నంలో కొయ్య పెద్ధపులిలా తిరగవలసిందేగాని తప్పించుకోవాలంటే వీలులేదు. ఇల్లాంటపుడు నీ దయవల్ల ఆడబోయిన తీర్థం ఎదురైనట్లు నా కోరిక ఈడేరుతోంది. నేను వరించిన మృత్యుదేవత నాకు ఎదురుగా వచ్చి కౌగిలించుకుంటోందా.

**నాగన్న:** అవును. నా చేతికి దొరికిన తర్వాత నీవు కోరుకోకపోయినా చావు తప్పదు.

**ఇన:** అమ్మయ్య!

**నాగన్న:** అయితే ఈ ఆరు నెలలనుండి ఏంచేస్తున్నావు? ఎందుకు చచ్చిపోలేదు?

**ఇక:** ఇది అంతా ఒక అద్భుతకథ. నాకు ఆత్మహత్యచేసుకో టానికి ధైర్యము చిక్కలేదు.

**నాగన్న:** అయితే చావాలని లేదన్నమాటే.

**ఇన:** నేను చచ్చిపోవటానికి చేసిన ప్రయత్నాలు వింటే మీరిట్లా అనరు.

**నాగన్న:** చావాలని ఉంటే ధైర్యం అదేవస్తుంది. ఆత్మహత్య చేసుకుంటే నరకం వస్తుందని భయమా?

**ఇన:** ఏమో, ఆ విషయం అంతగా ఆలోచించలేదుగాని ఇంకోళ్లను చంపటంగాని మన్నిమనం చంపుకోటమైనా అంత సులువుగా ఆలోచించకుండా చేయవలసిన పనిగాదు. దానివల్ల ఇహలోకంలోనూ, పరలోకంలోగూడా చాలా నష్టాలున్నాయి.

**నాగన్న:** ఏం, నల్లిని నలిపినట్లు నలిపెయ్యటమే.

**ఇన:** అబ్బే, దేవుడు మనల్ని అందరినీ పుట్టించాడు కదా. ఇంకొక్కణ్ణి చంపటం అతని సొత్తును నాశనం చేయ్యటమే

కదా. అనవసరంగా వృధాగా సారానీసాలు నేలపాలుచేస్తే మీ కంతకోపం వచ్చిందికదా, ఆ దేవుడికి అతనిసొత్తు నేల పాలుచేస్తే కోపరాదా?

**నాగన్న:** ఇంత ఆలోచించేవాడు ఏపని చేయ్యలేడు. అయితే ఆత్మహత్య మానుకున్నట్లేగా.

**ఇన:** లేదు. ఇంకో సులువుమార్గం ఆలోచించాను.

**నాగన్న:** ఏమిటది?

**ఇన:** ఇంకెవరైనా నన్ను చంపితే బాగుంటుందని. దానివల్ల వచ్చే కష్టనష్టాలన్నీ ఈ లోకంలోగాని, ఆ లోకంలోగాని అతగాడే భరిస్తాడని.

**నాగన్న:** అందుకని ఏం చేశావు?

**ఇన:** బుద్ధిపూర్వకంగా ప్రమాదాలను వెదుక్కొంటూ బయలు దేరాను.

**నాగన్న:** చచ్చిపోవటానికి ఇన్ని ప్రయత్నాలు చేయ్యాలా చెప్పు ఒకసారి.

**ఇన:** రోజూ పత్రికలలో కార్లక్రింద పడిచచ్చిపోయే మనుష్యుల సంగతి చదివి నాలుగురోడ్లు కలిసేచోట మ్యూజియం ముందు వచ్చిపోయే కార్లకు ఎదురుగా నిలబడేవాణ్ణి. ఒక్క కారుకూడ నామీదనుంచి పోలేదు.

**నాగన్న:** ఏం?

**ఇన:** మోటారుకార్లు, పరుగెత్తుకొని పారిపోయేవాళ్లమీదకు ఎక్కతాయిగాని, నిలువుగా నిలిచి మీదకు ఎక్కమని నిలబడితే వాళ్లమీదకు ఎక్కవని తరువాత తెలిసికొన్నాను.

**నాగన్న:** అయితే తరువాత ఏంచేశావు?

**ఇన:** సారంగధర మెట్టదగ్గర దొంగలు దోచుకొని చంపేస్తా రని విన్నాను. అందుచేత చేతికి బంగారుగొలుసు, రిష్టువాచి, వ్రేలికి ఉంగరాలు పెట్టుకొని అర్ధరాత్రి వెళ్లాను.

**నాగన్న:** ఏం దొంగలు కనిపించలేదా యేమిటి? ఇనిసిపెక టరు రావటం అల్పుటు ముందే తెలుస్తుంది.

**ఇన:** కాదు, కనిపించకేం. దొంగలు ఆ రిష్టువాచి, బంగారు గొలుసు, ఉంగరాలు అన్నీ లాక్కుని పోమ్మని పంపేశారు.

**నాగన్న:** వాళ్లు ఒదిలేశారా? నిన్ను గుర్తపట్టలేదేమో? తరువాత ఏంచేశావు?

**ఇన:** గోదావరి ప్రక్క ఊరు కూనలం ఉన్నదే కలపవర్తకం చేస్తాడు.

**నాగన్న:** ఓరి ఆయన్నగాడేనా?

**ఇన:** అవును. మీ కెట్లా తెలిసింది. అతన్ని మీ రెరుగుదురా.

**నాగన్న:** మొదట్లో చిన్నప్పుడు మే మిద్దరం పులివేటగాళ్లం. ఇప్పుడు ఈ తుపాకులు వచ్చాయిగాని, మా చిన్నప్పుడు బల్లేలతో ఎన్ని పులుల్ని ఏటేశామో. ఆడు నేను ఒక తెల్లదొర- మతం ఇవ్వటానికి వస్తారే - ఆ తెల్లదొరదగ్గర తుపాకీ పేల్చటం నేర్చుకున్నాం. ఆడు మొనగాడే, ఇద్దరు తెల్లదొరల్ని పేల్చేశాడు.

**ఇన:** అట్లాగా, ఎందుకు? ఆ విషయం ఏదో ఉండాలి. అది.

**నాగన్న:** ఏముంది? మతం ఇస్తామని మా గూడెందగ్గర మకాంపెట్టారు. ఒక ఆసుపత్రి, చర్చికట్టారు. మతం అని, వైద్యం అని, మధ్య మధ్య కొందరు ఆడోల్లని తగులుకున్నారు. అయ్యన్నగాడి మరదలు తెల్లపిల్లల్ని కనగానే అడికి రేచిక్కా ఏ సుకొచ్చి ఆ తెల్లపిల్లల్ని, ఆ ఆడోళ్లని, ఇద్దరు తెల్లదొరల్ని

క్రొత్తగా నేర్చుకున్న తుపాకీ పాఠం గురుదక్షిణగా గురువుగార్లకు అప్ప చెప్పాడు.

**ఇన:** అవును. అతనికి మనవాళ్లలో తెల్లరక్తం చేరటం అంటే చాలాకోపం. అల్లాంటివాళ్లని వెదకి వెదకి చంపేస్తున్నాడు. మొన్న ఏడాదిక్రితం ఒక టికెట్టు కలెక్టరును నిష్కారణంగా చంపేశాడు. అప్పుడు నేను తెల్లరక్తం ఏడు తరాలక్రితం కలిసినా చేతులుచూచి గుర్తుపట్టగలనని స్నేహంచేశాను.

**నాగన్న:** ఆఁ! అయితే నువ్వు తెల్లరక్తం గుర్తుపట్టగలవన్న మాట. లచ్చన్నగాడి సవతి తమ్ముడు ఆ తెల్లోడు, నాకు మొదటినుండి అనుమానమే. చూచి చెపుతా వేమిటి? నాపని తేలికఅయిపోతుంది. మా అయ్యన్నగాడి వాటాలో పడతాడు. నీకు ఒకరోజు ఆయుర్దాయం పెరుగుతుంది.

**ఇన:** అబ్బే, నిజానికి నాకేమీ రక్తపరీక్ష చేతగాదు. ఊరికే బుకాయించాను. అంతే. ఒక రోజున రహస్యంగా అయ్యన్నతో నీది మూడో తరం తెల్లరక్తం అని చేతులు పరీక్షించి చెప్పాను. కోపంవచ్చి నన్ను కాల్చేస్తానని.

**నాగన్న:** ఆ ఏం చేశాడు?

**ఇన:** లోపలికి, తీసుకొనివెళ్లి నిజంగా నేనా! అని దీనంగా బ్రతిమాలుకున్నాడు. నేను ముమ్మాటికి నిజం, దేవుడు తోడు అన్నాను. వెంటనే తుపాకీ తీసుకొచ్చి.

**నాగన్న:** ఆ తుపాకీ తీసుకొచ్చి...

**ఇన:** తుపాకీ తీసుకొచ్చి గురిపెట్టి ప్రేల్చేసుకున్నాడు.

**నాగన్న:** ఆరే చచ్చిపోయాడా?

**ఇన:** ఆసుపత్రిలో చేర్చారు. చచ్చేడుంటాడు. నేను నిరాశతో విసుగెత్తిపోతే యీ కొండలో సారాబట్టీ లున్నాయని, వాటిదగ్గర కెవరైనా వస్తే చంపేస్తారని విని వెతుక్కుంటూ వచ్చాను.

అదృష్టం పండింది. మీ పోరగాళ్లు పట్టుకొని మీ దగ్గరకు తీసికొనివచ్చారు.

**నాగన్న:** అయితే నన్ను చంపమంటారు. అంతేనా!

**ఇన:** ఆc, చంపుతానన్నారుగా! నీవే చంపకపోతే ఇక నాకు దిక్కెవరు?

**నాగన్న:** ఆc! నిన్ను వదలిపెడతానా, రెండు నిమిషాలలో చంపేస్తాను. ఒరే ఏదిరా నా తుపాకీ, గుండ్లూ ఇల్లా ఇయ్యి. (అని లోపలికివెళ్లి తుపాకీ పుచ్చుకుంటాడు, గుండ్లు చప్పుడు) ఇదిగో తుపాకీ, ఏనిమిది గుండ్లు ఏకటాకీని పేల్చవచ్చు. (లోపల చప్పుడు) ఏమిటిరా అది? (అని తుపాకీ అతనిదగ్గర బల్లమీదపెట్టి లోపలికి వెళ్లుతాడు.)

**ఇన:** (ఆ తుపాకీని చూస్తూ కూర్చుంటాడు)

**నాగన్న:** (ప్రవేశించి) చూచావా నా తెలివి! ఈ తుపాకీ నీ చేతి కందేటట్లు పెట్టి లోపలికి పోయాను. నీ చావు అబద్ధం, నా చావు నిజం కావలసింది. చూశావా.

**ఇన:** చూడకేం.

**నాగన్న:** అయితే, ఆ తుపాకీ తీసుకొని నన్ను ప్రేల్చెయ లేదేం.

**ఇన:** నిన్ను చంపాలని నా కోరిక కాదుగా.

**నాగన్న:** అయితే, ఇందాకటినుండి నీవు చెప్పేమాటలు, బస్తీకబుర్ల రాయళ్లు చెప్పేవి సరదాగా ఉంటాయని విన్నాను. నమ్మేటంత దున్నపోతు గాడిదిముండా కొడుకు నను కుంటున్నావేమిటి? చూడు. ఈ తుపాకీలో గుండ్లు పెట్టినట్లు చప్పుడు చేశాను. అంతే. దాన్లో గుండ్లు లేవు. నీకు ప్రాణాలమీద తీపి ఉన్నదా లేదా పరీక్షించాను.

ఏమాత్రం ప్రాణాలమీద తీపిఉన్నా, తుపాకీ తీసేవాడివే. ఇక నమ్మకం కలిగింది నీకు నిజంగా చావాలని ఉన్నదని.

**ఇన:** నా కెందుకా శ్రమ ? తుపాకీలో గుండ్లు ఉంటేయేం? లేకపోతేయేం? మరచిపోయాను. ఆ వైధవతుపాకీ అష్టావక్రుడికి అన్నగారుగ ఉన్నది. నన్నుగూడ ఆ గీతకత్తితోనే చంపు. ఒక్క వేటున ప్రాణం పోతుంది. అయ్యన్న పాపం తుపాకీగుండుతో చాలసేపు గిలగిలా తన్నుకొని ఉండాలి.

**నాగన్న:** సరే. నీకు తుపాకీకాదు, గీతకత్తివద్దు. అర్ధరాత్రి మా పోరగాళ్లు నిద్రలేపేశారు. కాని తెల్లవారిపోతోంది. అగో వేగుచుక్క పొడిచింది. పోవయ్యా, పో.

**ఇన:** అంటే, కొంపదీసి నన్ను చంపవా ఏమి? ఇంతవరకూ నీ గుడిసెదగ్గరకు వచ్చినవా ళ్లెవరూ ప్రాణాలతో తిరిగి పోలేదని, నీ ఉనికిపట్టు ఎవరూ పట్టుకోలేకపోతున్నారని చెప్పావు. మాటల భీకరమేనా?

**నాగన్న:** నీ ప్రాణాలు నీవు తీసుకోలేవుగాని, పాపం ఆవని నీకోసం మేము చేసిపెట్టాలా! నేను నీ నౌకరు ననుకో న్నావా? నా కేం గరుజెక్కిం దనుకొంటున్నావా?

**ఇన:** ఒక్కమాట. ఇదివరకు మీరు ఎంతమందిని చంపేశారో! ఇంకొక్కణ్ణి చంపటంవల్ల మీకు అధికంగావచ్చే పాపంగాని, భయంగాని, ప్రమాదంగాని ఏమీలేదు. నాకు ఈ బ్రదుకు దుర్భరంగా ఉన్నది. దయయుంచి నన్ను చంపెయ్యండి. ఆ గీతకత్తి-ఆహా! ఎంత అందముగా ఉన్నది.

**నాగన్న:** అదేమిటయ్యోయ్, అనవసరంగా నేను చలిచీమను గూడా చంపను. తెలిసిందా! అవసరమైతే పెద్దపులిని గూడా లెక్క చెయ్యను. పోవయ్యా పో, చచ్చిపోతే ఏముంది! ఫరవాలేదు. కష్టాలకు మందు చావు కాదయ్యా, బ్రదకటమే.

**ఇన:** అయ్యో ఇదేమిటి! పోనీ మీ పిల్ల కాయలు ఎవరైనా చంపమని అడగండి. వాళ్లు అక్కడే చంపుతామన్నారు.

**నాగన్న:** మా పోరగాళ్లు నామాటలేనిదే, ఇంకొరి వెంట్రుకైన పీకరు. ఆళ్లు ఇక్కడ ఎవరూ లేరు. తెలిసిందా. ఒక వేళ నా సిబ్బంది అయినా నిన్ను పట్టుకున్నప్పుడు వెనుక ముందు తెలిసికొని మళ్లీపట్టుకోవచ్చని పంపాను. అది ఇరవైమైళ్లలో పడ్డారని ఇంతకుముందే తెలిసింది. కొంచం ఓపిక తెచ్చుకొని బ్రదకవయ్యా, బ్రదుకు.

**ఇన:** ఏం చేస్తాను? ఇంక బ్రదకక తప్పదేమో!

**నాగన్న:** ఏమయ్యోయ్, బ్రదుకు. నీ మాటలు, నీ తెలివి తేటలు, చావుముందుగూడ తొణకని బెణకని సాహసం, నాకు నచ్చాయయ్యా. నీలాంటివాళ్లు బ్రదికివుండవలసిందే.

**ఇన:** అంతేనంటారా! అయితే ఇకమీద జీవితంలో నేను అనుభవించవలసిన కష్టాలన్నిటికీ మూలకారణం నాగన్న అన్నమాటే. ఆ పాపం అంతా మీ మెడకే చుట్టుకుంటుంది.

**నాగన్న:** నేను ఎప్పుడూ పుణ్యంకోసం ప్రాకులాడలేదు. పాపానికి భయపడలేదు. సరేగాని, అదుగో ఆ చెట్టు క్రిందే ఉంది మా గుర్రం. చూశావా!

**ఇన:** అవును, మీ గుర్రాన్ని రాత్రిగూడ నిద్రపోనివ్వ రన్నమాట.

**నాగన్న:** మా పోరగాళ్లు నా నిద్ర పోగొట్టారు. ఇదుగో వేగు జుక్కపొడిచింది. గుర్రంఎక్కి కనిపించే ఈ అడ్డదారిని పడితే, అరగంటలో గోదావరి చేరవచ్చు. (భుజం తట్టి) పోవయ్యా పో...

**ఇన:** అయితే, మీరు తప్పకుండా మా ఊరు రావాలి. మీ పేరు పట్నాలలో మారుమోగిపోతోంది. మిమ్మల్ని చూపించటానికి టిక్కట్టు పెట్టినా, రూపాయల వర్షం కురుస్తుంది.

**నాగన్న:** నాగుబాము, నరుడు తన్ను చూడగూడదని, తాను నరుణ్ణి చూడగూడదని ప్రొద్దున్నే సూరీడుకు నమస్కారం చేస్తుందట. నేనూ అంతే.

**ఇన:** అయినా, నాకంటే మీరుపడ్డారు, మీకంట నేను పడ్డాను. అనుకోకుండా మనం ఇద్దరం ఇంత దగ్గరవాళ్లం అయిపోయాము. నా పేరు, ఇంటి అడ్రసు, వీధిపేరు, మీకు తెలియాలి.

**నాగన్న:** చెప్పావుగద, చాలు.

**ఇన:** కాదు. మరదిపోకుండా వ్రాసియిస్తాను. కాగితం...

**నాగన్న:** ఎప్పుడో ఏ బై ఏళ్ల క్రితం అచ్చరాలు దిద్దాను. కాగితం, కలం ఏడున్నాయి.

**ఇన:** అయితే ఈ ఫోటో వెనక వ్రాస్తాను. నా దగ్గర కలం ఉంది.

**నాగన్న:** కొంచం పెద్ద అచ్చరాలు రాయవయ్యోయ్.
**ఇన:** (వ్రాసి బొమ్మ బల్లపై పెట్టి) సెలవు. ఇకమీద మనం తరచు కలుసుకోవాలని నా కోరిక.

**నాగన్న:** నా నిద్ర పాడయింది, వెళ్లు. నీ పెళ్లాం మంగళ సూత్రం బలమైందిలే.

*ఇనస్పెక్టరు నిష్క్రమణం*

*గుర్రపు గిట్టల చప్పుడు*

**నాగన్న:** (అటు ఇటు పచారుచేస్తూ, బొమ్మ దూలానికి తగిలించబోయి అక్షరాలు చదువుతూ కొయ్యబారి పోతాడు.)

మృ...మృత్యుంజయుడు

ఆ:! మి త్రింజయుడే!

**(తెర)**